క్లుప్తంగా

దివ్యాంగులకు పెన్షన్ పెంపు ప్రొసీడింగ్స్



ప్రొసీడింగ్ అందజేస్తున్న జెడ్పీచైర్మన్ మధు

మంథని: ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ పెంపు చేయడంతో ఆ ఉత్తర్వు కాపీలను బుధవారం మంథనిలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అందించారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మంథని ఆర్డీఓ హనుమా నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ ఏరియాలోని శ్రీ విశ్వకర్మ శివాలయం ఆవరణంలో బుధవారం పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలతో ఉదయం 4.15 నిమిషాలకు యంత్ర స్థాపన, పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగుల మల్యాల రాజమౌళి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి మొదటి పోచమ్మ బోనాన్ని పోచమ్మ దేవతకు సమర్పించారు. మధ్యాహ్నం మహా అన్నదానం చేశారు.

లోకోపైలట్ల సమస్యలపై డీఆర్‌ఎంకు వినతి

రామగుండం: లోకోపైలట్లు విధి నిర్వహణలో చేరే క్రమంలో రైలింజన్‌లోనే తమ టూల్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని, టూల్‌బాక్స్‌లు మోసుకుపోయే పనిభారం తప్పించాలని కోరారు. ఈ మేరకు బుధవారం రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్‌గుప్తాకు ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ రామగుండం బ్రాంచి చైర్మన్ సీహెచ్.రవి డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో లోకోపైలట్లు ఎదుర్కొంటున్న ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అసలైన లబ్ధిదారులతో జాబితా రూపొందించాలి



వినతిపత్రం అందజేస్తున్న మహేశ్

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసిత యువకులకు చెల్లించాల్సిన పునరావాస ప్యాకేజీ పరిహారం చెల్లింపుల విషయమై రూపొందించిన జాబితాలో అనర్హుల పేర్లు తొలగించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు బుధవారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ వినతిపత్రం అందజేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పునరావాస గ్రామాలైన ఎల్లంపల్లి, ముర్మూర్, పొట్యాల, మద్దిర్యాల, వేంనూర్, కుక్కలగూడూర్ గ్రామాల నిర్వాసితులకు 2015 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారికి పునరావాస ప్యాకేజీ చెల్లించేందుకు 2019లోనే అర్హుల జాబితా సిద్ధం చేయగా కోవిడ్ కారణంగా సదరు జాబితా రద్దయింది. ఈ నేపథ్యంలో అధికారులు ఇటీవల నూతనంగా రూపొందించిన జాబితాలో అనర్హుల పేర్లు ఉండగా, 2019లో సిద్ధం చేసిన అసలైన లబ్ధిదారుల పేర్లు లేవని తెలిపారు. దీనిపై కలెక్టర్, అదనపు కలెక్టర్ స్పందించి రీ సర్వే చేపట్టాలని కోరారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముత్తారం: దేశ ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజలకు కోసం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అస్సాం ఎమ్మెల్యే సుశాంత్, బీజేపీ మంథని బాధ్యుడు సుశాంత్ కోరారు. ముత్తారంలో బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు బుధవారం నిర్వహించిన ప్రవాసి ఎమ్మెల్యే సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముత్తారంలో బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు కావడం లేదని, మిగతా రాష్ట్రాల్లో వీటిని అమలు చేస్తున్నారన్నారు. అంతకు ముందు ముత్తారంలోని పెద్దమ్మ ఆలయంలో మొక్కులు చెల్లించారు. మంథని మాజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సునీల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి క్రాంతికుమార్, మండల ఇన్‌చార్జులు బిరుదు గట్టయ్య, ముల్మారి శ్రీనివాస్, నాయకులు అమ్ము శ్రీనివాస్, పెయ్యాల కుమార్, మారం శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్‌రావు, మూగ మల్లేశ్, దేవునూరి కొమురయ్య, మడిపోజు వెంకట్రాజం, ప్రశాంత్ పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు సరికాదు

- ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్
- నిధుల వినియోగంపై సమాచారం చెప్పడం లేదని మీర్జంపేట ఎంపీటీసీ జనార్ధన్‌రెడ్డి నిరసన



మాట్లాడుతున్న ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్

కాల్వశ్రీరాంపూర్: నిరాధారమైన ఆరోపణలు చేయడం సబబు కాదని ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల పరిషత్‌లో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన కొనసాగించారు. వెన్నంపల్లిలో 24 గంటలు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని, మిడిల్ పోల్స్ వేయాలని ఎంపీటీసీ జట్టి దేవయ్య ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యవేక్షణ కరువైందని విజిట్ చేసినప్పుడు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలేదని కిష్టంపేట సర్పంచ్ కాసర్ల తిరుపతిరెడ్డి ఆరోపించారు. సర్వసభ్య సమావేశానికి జిల్లా అధికారులు హాజరు కావడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు లేని వారికి కొత్తకార్డులు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ జూకంటి శిరీష తహసీల్దార్ జాహెద్ పాషాను కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు సమష్టి కృషితో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మండలంలో వివిధ అభివృద్ధి పథకాలు పూర్తి చేశామని పేర్కొన్నారు. సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు, అంశాలపై ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్ పేర్కొన్నాడు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీవో గోవర్ధన్, సూపరిటెండెంట్ సురేశ్, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, ఎంపీటీసీలు రావి సదానందం, జట్టి దేవయ్య, పెండ్లి సంపత్, గూడెపు జనార్ధన్, గడ్డం రాంచంద్రం, కొల్లూరి రమాదేవి, సుముకం నిర్మల, మాదాసు సువర్ణ, బొల్లమల్ల కౌసల్య, కదురు మానస, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మీర్జంపేట ఎంపీటీసీ నిరసన



నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ జనార్ధన్‌రెడ్డి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో నిధుల వినియోగంపై పలుమార్లు సమాచారం కోరినా అధికారులు దాటవేస్తున్నారని ఆగ్రహిస్తూ బుధవారం మండల పరిషత్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మీర్జంపేట ఎంపీటీసీ గూడెపు జనార్ధన్‌రెడ్డి బైటాయించి నిరసన వ్యక్తం చేశాడు. 14వ ఫైనాన్స్‌లో విడుదలైన నిధులు, ఎవరికి ఎంత కేటాయించారు, ఆయా గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల గురించి సమాచారం ఇవ్వాలని కోరినా అధికారులు దాట వేస్తున్నారన్నారు. మండల సభలో నిరసన తెలిపిన అధికారుల స్పందన లేకపోవడంతో వాకౌట్ చేశాడు. అనంతరం మండల పరిసత్ కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశాడు.

స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలి



సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

ఎలిగేడు: గ్రామంలో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టిసారించి ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపు తీసుకు రావాలని అడిషనల్ (స్థానికసంస్థల)కలెక్టర్ అరుణశ్రీ అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్-2023 కేంద్ర బృందం పర్యటన ఉన్నందున గ్రామంలో పర్యటించి తడి, పొడి చెత్త నిర్వహణ, సామూహిక ఇంకుడుగుంతలు, సామూహిక మరుగుదొడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రంతోపాటు ఇంకుడు గుంతలను పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఏపీడీ సత్యనారాయణ, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రాఘవులు, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్, ఏపీవో సదానందం, కార్యదర్శి వినోద్‌కృష్ణ, టీఏ, సీసీ, ఎఫ్ఏ, వీవోఏలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీచైర్మన్ పుట్ట మధుకు ఘన స్వాగతం



పుట్ట మధుకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కమాన్‌పూర్: బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థిగా జెడ్పీచైర్మన్ పుట్ట మధును సీఎం కేసీఆర్ ప్రకటించగా మంథనికి వస్తున్న పుట్ట మధుకు పార్టీ శ్రేణులు మండలంలోని గొల్లపల్లె వద్ద ఘన స్వాగతం పలికారు. గుండారం, కమాన్‌పూర్ నుంచి బైక్ ర్యాలీతో మంథనికి వెళ్లారు.

ముత్తారం: మంథని ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పుట్ట మధూకర్‌ను ప్రకటించగా కమాన్‌పూర్ మండలం గొల్లపల్లి నుంచి మంథనికి వెళ్లే ర్యాలీలో భాగంగా బుధవారం ముత్తారం ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, సర్పంచుల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్ ఆధ్వర్యంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాగతం పలికారు.

రామగిరి: బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ అభ్యర్థిగా పుట్ట మధును ప్రకటించిన అనంతరం బుధవారం మంథనికి వస్తున్న ఆయనకు బీఆర్‌ఎస్ మండల శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

జెడ్పీచైర్మన్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

పాలకుర్తి: బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా జెడ్పీచైర్మన్ పుట్ట మధును ప్రకటించడంతో పాలకుర్తి మండలం కన్నాల, రాణాపూర్ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు కన్నాల సింగిల్‌విండో చైర్మెన్ బయ్యపు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా గోదావరిఖనిలో మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సుల్తానాబాద్: పార్టీలకు అతీతంగా తనకు మద్దతు లభిస్తోందని జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. హైదరాబాద్ నుంచి మంథనికి బుధవారం వెళ్తుండగా సుల్తానాబాద్‌లో ఆగారు. బీసీ వర్గాల మద్దతుతో పాటు అన్ని వర్గాల మద్దతు ఇవ్వాలని కోరారు. టికెట్ కేటాయించడంతో పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెన్షన్ పెంపుతో దివ్యాంగుల కుటుంబాల్లో వెలుగులు



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

పెద్దపల్లిరూరల్: పెరిగిన పెన్షన్ దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌ఆర్ గార్డెన్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన దివ్యాంగులకు అదనంగా పెన్షన్ పెంపు ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో దివ్యంగులకు ప్రత్యేక రాయితీ కల్పిస్తోందన్నారు. గృహలక్ష్మి పథకం కింద ప్రతి గ్రామంలో విచారణ చేపట్టి అర్హులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు పెన్షన్‌తో పాటు అవసరమైన పరికరాలను సైతం ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో సరఫరా చేస్తోందన్నారు. అనంతరం దివ్యాంగులకు పెన్షన్ పెంపు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. డీఆర్‌డీవో శ్రీధర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

పెద్దపల్లిరూరల్/కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీకి చెందిన నాయకులు, యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారు అనుముల వెంకట సాయి, మేడిద మహేందర్, జీడీ నరేశ్, శివకృష్ణ, సలాం, రాజ్‌కుమార్, సందీప్, వంశీ, రాజయ్య, సుదర్శన్, శ్రీకాంత్ ఉన్నారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గొడుగు రాజ కొమురయ్య, పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ జడల సురేందర్, సర్పంచ్ కొంకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ కదురు మానస పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

ధర్మారం: ధర్మపురి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించిన సందర్భంగా ధర్మారం మండల ఆర్యవైశ్య సంఘం బుధవారం ధర్మపురి ఆలయ కమిటీ డైరెక్టర్ జైన రాజమౌళి ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఆర్యవైశ్యులు కలిశారు. రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యుల మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జైన రాజమౌళితో పాటు సంఘం నాయకులు ఎలగందుల అశోక్, సిరిపురం గంగన్న, పడకంటి నర్సయ్య, యంసాని మహేశ్, జైన రాజు, జైన ఈశ్వర్, గుంత భాస్కర్, మల్యాల సత్యనారాయణ, శంకరయ్య, బీరెల్లి హేమాద్రి, కొత్త రమేశ్, కొల్లూరి కిషోర్, జైన చందు, రవీందర్ పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై సంబరాలు



ధర్మారం: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఓదెల: కొలనూర్‌లో సంబరాలు

ధర్మారం: భారత్ చంద్రయాన్-3 విజయవంతం కావడంతో బుధవారం సాయంత్రం ధర్మారం మండల కేంద్రంలోని సాయిమణికంఠ హైస్కూల్ విద్యార్థులు జాతీయత జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ జైన సురేశ్‌కుమార్ ధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల నుంచి స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాఘవులు, అశోక్ అన్నారు.

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలోని బస్టాండు చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

ఎలిగేడు: మండలవ్యాప్తంగా చంద్రయాన్ 3 విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. లాలపల్లిలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి మిఠాయిలు పంచారు.

బీఆర్‌ఎస్ నాయకుల బైక్ ర్యాలీ



ధర్మారం నుంచి బయలుదేరిన బైక్ ర్యాలీ

ధర్మారం: ధర్మపురి నియోజకవరం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించిన తర్వాత మొదటిసారి ధర్మపురి వచ్చిన సందర్భంగా రాయపట్నంలో కొప్పుల ఈశ్వర్‌కు స్వాగతం పలికేందుకు బుధవారం పార్టీ ధర్మారం మండల నాయకులు బైక్ ర్యాలీతో వెళ్లారు. దాదాపు 450 బైక్‌లతో రాయపట్నం వరకు ర్యాలీగా వెళ్లి ఘన స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మిట్ట తిరుపతి, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మంద శ్రీనివాస్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు అజ్మీర మల్లేశ్‌నాయక్ పాల్గొన్నారు.

డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

కమాన్‌పూర్: డెంగీ వ్యాధిపై ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రాజమౌళి ఆదేశించారు. మండల కేంద్రంలోని రాంగనర్‌కు చెందిన రాజనర్సు డెంగీ బారిన పడగా బుధవారం రాంనగర్‌ను సందర్శించి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయించారు. మెడికల్ క్యాంపులో రెండు డెంగ్యూ కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. డెంగ్యూ బారిన పడిన వారిని పెద్దపల్లి ఆస్పత్రికి రెఫర్ చేయించారు. ఆయన వెంట కమాన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్‌కుమార్, తిరుపతయ్య, పురుషోత్తం, వెంకటేశ్ ఉన్నారు.

కటికెనపల్లిలో నివారణ చర్యలు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లిలో మేడారం పీహెచ్‌సీ వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో బుధవారం డెంగీ నివారణ చర్యలు తీసుకున్నారు. కటికెనపల్లిలో డెంగీ జ్వరంతో బాధపడుతున్న ఇంటికి వైద్య బృందం వెళ్లి తగు సూచనలు చేశారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కారుపాక రాజయ్యకు సూచించారు. పల్లె వైద్యుడు గౌతం, సూపర్‌వైజర్ జయ, ఏఎన్‌ఎం స్వరూప, కార్యదర్శి సమ్మయ్య, ఆశావర్కర్ సంధ్య పాల్గొన్నారు.

జీడీకే-5 ఓసీపీ సందర్శన

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 పరిధిలోని జీడీకే-5 ఓసీపీని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. అధికారులతో కలిసి వ్యూపాయింట్ వద్దకు వెళ్లి క్వారీని పరిశీలించారు. కోల్ బెంచ్ పని స్థలాలను, అండర్ గ్రౌండ్ గ్యాలరీల జరుగుతున్న పనిని పరిశీలించి భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రణాళికల గురించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఫైర్ ఫైటింగ్ విధానం గురించి చర్చించారు. రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, మేనేజర్ అనిల్‌గబాలే, సేఫ్టీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి



గోదావరిఖని: బీజేపీ నాయకుల ఆందోళన

గోదావరిఖని: బీఆర్‌ఎస్ పనితీరును నిరసిస్తూ బుధవారం బీజేపీ నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయగా, కొందరు పోలీసులను తప్పించుకుని క్యాంపు కార్యాలయం గేట్ ఎదుట ఆందోళన చేశారు.

గృహ నిర్బంధం సిగ్గుచేటు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వెళ్తున్న క్రమంలో పెద్దపల్లి పోలీసులు గృహనిర్బంధం చేయడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేశ్‌రెడ్డి అన్నారు.

రామగుండం: అంతర్గాం మండల శ్రేణులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పోలీసులు బీజేపీ నాయకులను ముందుస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పెద్దపల్లిరూరల్: బీజేపీ రాష్ట్రశాఖ పిలుపుమేరకు బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వెళ్తున్న బీజేపీ నాయకులను అయ్యప్పస్వామి ఆలయం చౌరస్తా వద్దే అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సంక్షిప్త వార్తలు

✦ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

యైటింక్లయిన్‌కాలనీ: అసెంబ్లీలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై మాట్లాడిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను ఆర్జీ-2 ఏరియా కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం వైస్ ప్రెసిడెంట్ సాదుల రాజేశం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నాయకులు శంకర్, రవికుమార్, వెంకటేశ్, సుధాకర్ ఉన్నారు.

✦బీఎల్‌వోలకు గుర్తింపుకార్డులు

ఓదెల: మండలంలోని 40మంది బీఎల్‌వోలకు తహసీల్దార్ యాకన్న బుధవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో విధులు నిర్వర్తించే వారికి గుర్తింపు కోసం ఈ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐలు రాజేందర్, నర్సింగ్ ఉన్నారు.

✦సేవాసమితి ఫ్యాకల్టీ ఎంపికకు ఇంటర్వ్యూ

గోదావరిఖని: సింగరేణి సేవాసమితి ఆర్జీ-2 ఏరియా ఫ్యాకల్టీ సభ్యులకు బుధవారం స్థానిక సింగరేణి హైస్కూల్‌లో ఇంటర్వ్యూ నిర్వహించారు. కుట్టు మిషన్, మగ్గం వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఫ్యాకల్టీ సభ్యులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఎస్ఓటూ జీఎం అబ్దుల్ సలీం, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్ పాల్గొన్నారు.

✦బీజేపీలో చేరికలు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొండ లక్ష్మణ్‌తో పాటు 20 మంది యూత్ కాంగ్రెస్ నాయకులు బుధవారం మంథని ఇన్‌చార్జి చందుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా వారికి అస్సాం ఎమ్మెల్యే సుశాంత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంథని ఐటీ సెల్ ఇన్‌చార్జి తొట్ల రాజు, చక్రీ, జానీ ఉన్నారు.

✦బహిరంగ సభను విజయవంతం చేయాలి

ఓదెల: హైదరాబాద్‌లోని కోకాపేటలో 27న జరిగే పెరక బహిరంగసభను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్ కోరారు. ఓదెలలో కోకాపేట బహిరంగసభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. పెరక సంఘం సీనియర్ నాయకులు మీస అర్జున్‌రావు, ఓదెల పెరక సంఘం అధ్యక్షుడు గోపతి ఎల్లన్న, ఎంపీటీసీ బోడకుంట చిన్నస్వామి, మార్కెట్ మాజీ డైరెక్టర్ బోడకుంట నరేశ్ నాయకులు పోశెట్టి, చింతం కుమారస్వామి పాల్గొన్నారు.

✦టీబీ వ్యాధిపై అవగాహన

జూలపల్లి: క్షయ వ్యాధి వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. నిక్షయ దివస్‌ను పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. హెచ్‌వి వసంత, ఎస్‌టీఎల్ఎస్ సంపత్, ఎల్‌టీ కిరణ్ ఉన్నారు.

✦ఆలయ ప్రధాన ద్వారానికి గేటు వితరణ

పాలకుర్తి: పాలకుర్తి గ్రామ పంచాయతీ పరిధి లక్ష్మీపురం శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయానికి సర్పంచ్ దుర్గం జగన్ గేట్ వితరణ చేశారు. వార్డుసభ్యులు నరేశ్, శంకర్, నవీన్ ఉన్నారు.

✦పారిశ్రామిక ప్రాంతానికి అన్యాయం

గోదావరిఖని: పరిశ్రమల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన స్థానికులకు న్యాయం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల కోసం తమ భూములను త్యాగం చేస్తే, ఇక్కడి ప్రజలకు ఉద్యోగాలలో న్యాయం జరగలేదని, ఇక్కడ నుంచి రూ.వేలకోట్లు ఇతర జిల్లాలకు తరలి వెళ్తున్నాయని ఆరోపించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేదు

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్‌కు టిక్కెట్ల పంపకాల మీద ఉన్న శ్రద్ధ విద్యారంగ సమస్యలు పరిష్కరించడానికి లేదని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబెర్ అజయ్ ఆరోపించారు. మీడియా సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 15 లక్షల మంది పేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ మీద ఆధారపడి చదువుతుంటే, నాలుగేళ్ల నుంచి రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. 15వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లా కన్వీనర్ అజయ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీపతి సాయితేజ, నాయకులు అరవింద్, అజయ్, సందీప్ పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను పట్టించుకోవాలి



నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా రెండో ఏఎన్‌ఎంలు 16ఏళ్ల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగా సేవలు అందిస్తున్న తమను రెగ్యులర్ చేయండి అని 8 రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి సునీల్ అన్నారు. ఎనిమిదో రోజు పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో మోకాళ్లపై కూర్చుని ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని, వారి ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ రద్దుచేసి అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెండో ఏఎన్‌ఎం ఏఐటీయూసీ యూనియన్ జిల్లా నాయకులు స్వరూప రాణి, సుజాత, సునీత, రమాదేవి, అరుణ, శారద, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సుల్తానాబాద్: కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం పుష్పగుచ్ఛం ఇచ్చి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాక మహేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, సుల్తానాబాద్ మున్సిపల్ యూనియన్ నాయకులు రమేశ్, మల్లేశ్, లక్ష్మి, రాజయ్య, పోచయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా చింతకింది చంద్ర మొగిలి, ప్రధాన కార్యదర్శిగా నారాయణ దాస్ అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో బుధవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ ఎన్నికలు నిర్వహించగా ఎన్నికల అధికారిగా బుర్ర సంపత్‌కుమార్, ఎన్నికల పరిశీలకులుగా అంకరి ప్రకాష్, గుడ్ల శ్రీనివాస్ పర్యవేక్షించారు. కోశాధికారిగా బెజ్జంకి నరేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పులిపాక రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.